క్లుప్తంగా

బీఆర్‌ఎస్‌కు తల్లోజు రామకృష్ణ రాజీనామా



ఆమనగల్లు: తెలంగాణ ఉద్యమకారుడు, బీఆర్‌ఎస్ సీనియర్ నాయకుడు తల్లోజు రామకృష్ణ ఆ పార్టీకి రాజీనామా చేశారు. శుక్రవారం తన రాజీనామా లేఖను మాజీ సీఎం కేసీఆర్, జిల్లా బీఆర్‌ఎస్ అధ్యక్షుడు కిషన్‌రెడ్డికి పంపించారు. ఈ సందర్భంగా రామకృష్ణ మాట్లాడుతూ.. బీఆర్‌ఎస్ ఆవిర్భావం నుంచి పార్టీలో పనిచేశానని.. రాష్ట్ర సాధన ఉద్యమంలో క్రియాశీలకంగా పనిచేశానని తెలిపారు. అయితే రాష్ట్ర ఏర్పాటు అనంతరం అధికారంలోకి వచ్చిన బీఆర్‌ఎస్ ప్రభుత్వంలో తెలంగాణ ఉద్యమకారులకు గుర్తింపు లేకుండా పోయిందని ఆవేదన వ్యక్తం చేశారు. దీనికి తోడు వేరే పార్టీనుంచి బీఆర్‌ఎస్‌లోకి వచ్చిన మాజీ ఎమ్మెల్యే జైపాల్‌యాదవ్ ఏనాడూ ఉద్యమకారులను పట్టించుకోలేదని.. కేవలం డబ్బున్నవారికి, రియల్ ఎస్టేట్ వ్యాపారులకే ప్రాధాన్యం కల్పించారని ఆయన ఆరోపించారు. మాజీ ఎమ్మెల్యే జైపాల్‌యాదవ్ వైఖరికి నిరసనగా బీఆర్‌ఎస్ పార్టీకి రాజీనామా చేస్తున్నట్లు రామకృష్ణ ప్రకటించారు.

మతవిద్వేషాలను రెచ్చగొడుతున్నారు

నాగర్‌కర్నూల్ కాంగ్రెస్ ఎంపీ అభ్యర్థి మల్లురవి సతీమణి భవ్సీదేవి



సమావేశంలో మాట్లాడుతున్న భవ్సీదేవి

ఆమనగల్లు: దేశంలో మత విద్వేషాలను రెచ్చగొట్టి రాజకీయ లబ్ధి పొందేందుకు బీజేపీ ప్రయత్నిస్తోందని నాగర్‌కర్నూల్ కాంగ్రెస్ ఎంపీ అభ్యర్థి డా.మల్లురవి సతీమణి రాజ్యం భవ్సీదేవి విమర్శించారు. ఆమనగల్లు పట్టణంలో శుక్రవారం ఆమె మాట్లాడుతూ.. బీజేపీ దేశానికి ప్రమాదకారిగా మారిందని అన్నారు. లోక్‌సభ ఎన్నికల్లో తనభర్త మల్లురవిని భారీ మెజార్టీతో గెలిపించి బీజేపీ, బీఆర్‌ఎస్‌లకు బుద్ధి చెప్పాలని ఓటర్లను కోరారు. తనభర్తకు మాదిగల పూర్తి మద్దతు ఉందని తెలిపారు. కార్యక్రమంలో జిల్లా గ్రంథాలయ సంస్థ మాజీ డైరెక్టర్ జంగయ్య, అంబేడ్కర్ జాతర కమిటీ అధ్యక్షుడు సుధాకర్, నాయకులు మానయ్య, రఘురాములు,జంగయ్య, రమేశ్, యాదయ్య, వెంకటయ్య, శ్రీశైలం, రామస్వామి, మహేశ్, సురేశ్, పుల్లయ్య తదితరులు పాల్గొన్నారు.


క్రీడాకారులకు డ్రెస్‌ల పంపిణీ



డ్రెస్‌లు పంపిణీ చేసిన అతిథులు

ఇబ్రహీంపట్నం: వినోబానగర్‌లోని సాధన కుటీర్‌లో నిర్వహిస్తున్న శిక్షణ శిబిరంలో క్రీడాకారులకు శుక్రవారం స్పోర్ట్స్ డ్రెస్‌లను పంపిణీ చేశారు. ప్రభుత్వ బడుల్లో విద్యనభ్యసిస్తూ కబడ్డీ, వాలీబాల్ క్రీడల్లో ప్రతిభ కనబరుస్తోన్న 150 మంది విద్యార్థులకు జీఎస్‌ఎఫ్ ప్రత్యేక శిక్షణను ఇస్తుంది. ఈ సందర్భంగా వారికి ప్రత్యేక డ్రెస్‌లను, షూస్‌ను అందజేశారు. ఈ కార్యక్రమంలో స్థానిక ఎసీపీ కేపీవీ రాజు, సురసాని ట్రస్టుకు చెందిన రవీందర్‌రెడ్డి, వీఎంఎఫ్‌కు చెందిన బుచ్చయ్య, జ్ఞాన సరస్వతీ ఫౌండేషన్ వ్యవస్థాపకుడు సదా వెంకట్ పాల్గొన్నారు.

'పది' విద్యార్థులకు సన్మానం



విద్యార్థినులను సన్మానించిన ఉపాధ్యాయులు

ఇబ్రహీంపట్నం: పదో తరగతిలో ప్రతిభ కనబరిచిన ఎలిమినేడు ప్రభుత్వ పాఠశాల విద్యార్థులను ఉపాధ్యాయులు, గ్రామస్తులు శుక్రవారం ఘనంగా సన్మానించారు. పాఠశాలలో 20 మంది విద్యార్థులకుగాను 19 మంది పదో తరగతిలో ఉత్తీర్ణత సాధించి మండలంలో రెండో స్థానంలో నిలిచారని ప్రధానోపాధ్యాయుడు సుధాకర్ తెలిపారు. అక్షిత 9.5 జీపీఏ, దీప్తి 9.3 జీపీఏ, అఖిల 9.2 జీపీఏ సాధించి పాఠశాలలో టాపర్లుగా నిలిచారని తెలిపారు. భవిష్యత్‌లో వారు ఉన్నత శిఖరాలకు చేరుకోవాలని ఆకాంక్షించారు.ఉపాధ్యాయులు అరుణశ్రీ, వెంకటయ్య, గ్రామస్తులు.. గణేశ్, భిక్షపతి, మహేందర్, ఐలయ్య, రమేశ్, శ్రీశైలం, మల్లేశ్ తదితరులు పాల్గొన్నారు.

కానరాని స్వచ్ఛభారత్

- పంచాయతీల్లో ఎక్కడ పడితే అక్కడ చెత్త డంపింగ్
- రోగాలబారిన స్థానికులు
- పట్టించుకోని ప్రజాప్రతినిధులు, అధికారులు

అబ్దుల్లాపూర్‌మెట్: మండల పరిధిలోని మెజార్టీ పంచాయతీల్లో స్వచ్ఛభారత్ కానరావడం లేదు. ఎక్కడ పడితే అక్కడ చెత్త దర్శనమివ్వడంతో ప్రజలు రోగాలబారిన పడుతున్నారు. బహిరంగ ప్రదేశాల్లో చెత్త వేస్తే జరిమానా విధిస్తామని అధికారులు, ప్రజాప్రతినిధులు ప్రకటించినప్పటికీ దానిని అమలు చేయడంలో పూర్తిగా విఫలమవుతున్నారనే విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. వివరాల్లోకి వెళ్తే.. అబ్దుల్లాపూర్‌మెట్ మండలంలోని ఔటర్ రింగ్ రోడ్డు నుంచి బాటసింగారం వరకు జాతీయ రహదారికి ఇరువైపులా చెత్త కుప్పలుగా పోస్తుండటంతో పాటు దుకాణదారులు, వ్యాపారులు నిత్యం క్వింటాళ్ల కొద్ది చెత్తను, బాటసింగారంలో పండ్ల మార్కెట్‌కు వచ్చే వాహనాల్లోని చెత్తను జాతీయ రహదారికి పక్కనే పోస్తున్నారు. దీంతో స్థానికులు రోగాలబారిన పడటంతో పాటు రహదారి గుండా వెళ్లే వాహనదారులు దుర్వాసన భరించలేని పరిస్థితి నెలకొంది.



బాటసింగారం సమీపంలో పోగైన చెత్త

దీనికితోడు చెత్త వద్దకు పశువులు, పందులు రావడంతో వాటి వల్ల నిత్యం రోడ్డు ప్రమాదాలు చోటుచేసుకుంటున్నాయి. ఈ విషయంపై అధికారులకు పలుమార్లు ఫిర్యాదు చేసినా పట్టించుకోవడం లేదని స్థానికులు వాపోయారు. పరిస్థితి ఇలాగే ఉంటే ఆందోళన కార్యక్రమాలు చేపతామంటున్నారు.

రోగాలబారిన పడుతున్నారు

రోడ్డు పక్కన చెత్త డంప్ చేయడంతో తీవ్రమైన దుర్వాసన వస్తోంది. ముఖ్యంగా వృద్ధులు, పిల్లలు రోగాలబారిన పడుతున్నారు. కొన్ని నెలలుగా ఇక్కడి చెత్తను తొలగించడంలో అధికారులు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారు. మంత్రులు, ప్రముఖులు వచ్చిన సమయాల్లో మాత్రమే హడావిడిగా చెత్తను తీస్తారు. తర్వాత మళ్లీ అదే పరిస్థితి నెలకొంటుంది. అధికారులు స్పందించకుంటే ఆందోళన కార్యక్రమాలు చేపడతాం.

– శ్రీరాములు, అబ్దుల్లాపూర్‌మెట్

బీజేపీతోనే పేదరిక నిర్మూలన

- ఎంపీపీ కొప్పు సుకన్య
- ముమ్మరంగా నేతల ప్రచారం

యాచారం: బీజేపీతోనే పేదరిక నిర్మూలన సాధ్యమని ఎంపీపీ కొప్పు సుకన్య పేర్కొన్నారు. శుక్రవారం నస్దిక్‌సింగారంలో బీజేపీ శ్రేణులతో కలిసి ఆమె ఇంటింటి ప్రచారం నిర్వహించారు. కేంద్రం మంజూరు చేస్తున్న ఈజీఎస్ నిధులతోనే రాష్ట్రంలో ఉపాధి పనులు, గ్రామాల్లో సీసీ రోడ్లు, నర్సరీలు, చెట్ల పెంపకం, తాగునీటి సరఫరా తదితర పథకాలు చేపడుతున్నారని అన్నారు. ఈ సందర్భంగా ఉపాధి కూలీలను కలిసి భువనగిరి బీజేపీ ఎంపీ అభ్యర్థి బూర నర్సయ్యగౌడ్‌ను గెలిపించాలని కోరారు. ఈ కార్యక్రమంలో బీజేవైఎం ఇబ్రహీంపట్నం నియోజకవర్గ కన్వీనర్ రవీందర్‌రెడ్డి, నాయకులు రమేష్, కార్తీక్‌చారి, జంగయ్య తదితరులు పాల్గొన్నారు. అలాగే మొండిగౌరెల్లిలో బీజేపీ శ్రేణులు ఉపాధికూలీలకు పనిప్రదేశంలో మజ్జిగ పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో బీజేపీ కిసాన్ మోర్చా రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మర్పల్లి అంజయ్య యాదవ్, యాచారం మండల అధ్యక్షుడు రవీందర్, జిల్లా కార్యవర్గ సభ్యుడు యాదగిరిరెడ్డి, నాయకులు శ్రీనివాస్‌గుప్త, మల్లేష్ యాదవ్, శ్రీనివాస్ యాదవ్, వెంకటేష్, శివ, సందీప్‌రెడ్డి పాల్గొన్నారు.

బీజేపీతోనే అన్నివర్గాలకు న్యాయం..

తలకొండపల్లి: బీజేపీతోనే అన్నివర్గాలకు న్యాయం జరుగుతుందని ఆ పార్టీ ఓబీసీ జిల్లా ప్రధాన కార్యదర్శి, మాజీ సర్పంచ్ బక్కి కుమార్ అన్నారు. నాగర్‌కర్నూల్ బీజేపీ ఎంపీ అభ్యర్థి భరత్ ప్రసాద్‌కు మద్దతుగా శుక్రవారం మండల పరిధిలోని చంద్రధన, పూల్‌సింగ్ తండా, సళ్లరాళ్ల తండాలో కుమార్ ఆధ్వర్యంలో ఇంటింటి ప్రచారం నిర్వహించారు. కేంద్రంలో మరోసారి ఎన్డీఏ కూటమే అధికారంలోకి వస్తుందని ధీమా వ్యక్తం చేశారు. నాగర్‌కర్నూల్ నుంచి భరత్ ప్రసాద్‌ను అత్యధిక మెజార్టీతో గెలిపించాలని ఓటర్లను కోరారు. ఈ కార్యక్రమంలో నాయకులు.. భగవంత్, డాక్టర్ ప్రసాద్ తదితరులున్నారు.



యాచారం: ఉపాధి కూలీలను ఓటు అభ్యర్థిస్తున్న ఎంపీపీ సుకన్య

బీఆర్‌ఎస్‌తోనే అభివృద్ధి

మండల అధ్యక్షుడు రమేష్

మంచాల: బీఆర్‌ఎస్‌తోనే అభివృద్ధి సాధ్యమని ఆ పార్టీ మండల అధ్యక్షుడు చీరాల రమేష్ అన్నారు. మంచాల మండలంలోని తిప్పాయిగూడ, చిత్తాపూర్, తాళ్లపల్లిగూడలో శుక్రవారం నిర్వహించిన ఎన్నికల ప్రచారంలో ఆయన పాల్గొన్నారు. ఇంటింటికి తిరిగి కారుగుర్తుకు ఓటు వేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ నర్మద, మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ చంద్రయ్య, ప్రధాన కార్యదర్శి బహదూర్, పీఏసీఎస్ మాజీ చైర్మన్ సికిందర్‌రెడ్డి, ఎంపీటీసీ సుకన్య, నాయకులు పుల్లారెడ్డి, నాగరాజుగౌడ్, పెద్దిరాజు, శ్రీనివాస్, రాజేష్, గణేష్, మల్లేశ్, శివకుమార్, కృష్ణ, అశోక్, మహేందర్, సత్తయ్య, శ్రీశైలం తదితరులు పాల్గొన్నారు.

క్యామను గెలిపించుకుందాం..

ఇబ్రహీంపట్నం: లోక్‌సభ భువనగిరి బీఆర్‌ఎస్ అభ్యర్థి క్యామ మల్లేశ్‌ను అత్యధిక మెజార్టీతో గెలిపించాలని కోరుతూ నాగన్‌పల్లిలో శుక్రవారం ఆపార్టీ మండల అధ్యక్షుడు బుగ్గరాములు ఇంటింట ప్రచారం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ.. ఆరు గ్యారెంటీల పేరుతో ప్రజలను మోసం చేసి కాంగ్రెస్ పార్టీ రాష్ట్రంలో అధికారంలోకి వచ్చిందన్నారు. ఆ హామీల అమలులో విఫలమైన కాంగ్రెస్ పార్టీకి లోక్‌సభ ఎన్నికల్లో ప్రజలు బుద్ధి చెప్పాలన్నారు. కారు గుర్తుకు ఓటువేసి క్యామ మల్లేశ్‌ను అత్యధిక మెజార్టీతో గెలిపించాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఎంపీటీసీ మంగ, పార్టీ నాయకులు ఆంజనేయులు, ఐలయ్య, సుభాష్, మహేందర్ తదితరులు పాల్గొన్నారు.



తాళ్లపల్లిగూడ ప్రచారంలో బీఆర్‌ఎస్ నాయకులు

సోషల్ మీడియాలో తప్పుడు ప్రచారం

తలకొండపల్లి పీఎస్‌లో ఫిర్యాదు

కాంగ్రెస్ నేతల ఫిర్యాదు

తలకొండపల్లి: సోషల్ మీడియాలో కాంగ్రెస్ పార్టీపై తప్పుడు ప్రచారం చేస్తున్న వ్యక్తులపై తగిన చర్యలు తీసుకోవాలని కాంగ్రెస్ నాయకులు డిమాండ్ చేశారు. ఈ మేరకు శుక్రవారం తలకొండపల్లి పోలీస్ స్టేషన్‌లో వారు ఫిర్యాదు చేశారు. కాంగ్రెస్ జాతీయ నాయకుడు రాహుల్ గాంధీ, తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డిపై అసత్య ప్రచారాలను ఫార్వర్డ్ చేస్తున్న వ్యక్తులను గుర్తించి వారిపై క్రిమినల్ కేసులు నమోదు చేయాలని ఫిర్యాదులో పేర్కొన్నారు. సోషల్ మీడియాలో మితిమీరి పోస్టులు పెట్టవద్దన్నారు. కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు.. అంజయ్య గుప్తా, మోహన్‌రెడ్డి, యాదయ్య, రవీందర్ యాదవ్, కృష్ణ, రమేశ్, మల్లేశ్, నర్సింహ, పాండు పాల్గొన్నారు.

హామీలను పక్కాగా అమలుచేస్తాం

- ఎమ్మెల్యే కోమటిరెడ్డి రాజగోపాల్‌రెడ్డి
- చామకు మద్దతుగా నేతల ప్రచారం

మంచాల: కాంగ్రెస్ పార్టీతోనే అభివృద్ధి సాధ్యమని ఆ పార్టీ భువనగిరి ఇన్‌చార్జి, మునుగోడు ఎమ్మెల్యే కోమటిరెడ్డి రాజగోపాల్‌రెడ్డి అన్నారు. గురువారం రాత్రి మంచాల మండలంలోని ఆరుట్లలో నిర్వహించిన కాంగ్రెస్ పార్టీ ఎన్నికల ప్రచార సభలో స్థానిక ఎమ్మెల్యే మల్‌రెడ్డి రంగారెడ్డి, ఎంపీ అభ్యర్థి చామల కిరణ్‌కుమార్‌రెడ్డితో పాటు రాజగోపాలరెడ్డి పాల్గొన్నారు. వారు మాట్లాడుతూ.. ప్రతి ఒక్కరూ హస్తం గుర్తుపై ఓటువేసి చామల కిరణ్ కుమార్‌రెడ్డిని గెలిపించాలన్నారు. ఎన్నికల హామీలను పక్కాగా అమలుచేస్తామన్నారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు ఈసీ శేఖర్‌గౌడ్, కొంగర విష్ణు వర్ధన్‌రెడ్డి, జిల్లా మహిళా కాంగ్రెస్ అధ్యక్షురాలు జయమ్మ, ఇబ్రహీంపట్నం జెడ్పీటీసీ సభ్యుడు మహిపాల్, మంచాల అధ్యక్షుడు రాంరెడ్డి, ఆరుట్ల ఎంపీటీసీ శ్రీనివాస్, నాయకులు హన్మంత్‌రెడ్డి, వెంకటేశ్ యాదవ్, రమేష్, చంద్రయ్య పాల్గొన్నారు.



మంచాల: ప్రచారంలో ఎమ్మెల్యే రాజగోపాల్‌రెడ్డి, చామల

కాసాని జ్ఞానేశ్వర్ గెలుపే లక్ష్యం

- జోరుగా బీఆర్‌ఎస్ ఇంటింటి ప్రచారం

బడంగ్‌పేట్: చేవేళ్ల పార్లమెంట్ అభ్యర్థి కాసాని జ్ఞానేశ్వర్ గెలుపే లక్ష్యంగా పనిచేయాలని బడంగ్‌పేట 30 డివిజన్ కార్పొరేటర్ భీమిడి స్వప్న జంగారెడ్డి పేర్కొన్నారు. శుక్రవారం భీమిడి స్వప్న జంగారెడ్డి ఆధ్వర్యంలో 32, 30, 23 డివిజన్లో ఇంటింటికి తిరిగి జోరుగా ప్రచారం నిర్వహిస్తున్నారు. మాజీ కౌన్సిలర్లు ప్రసన్న వెంకట్‌రెడ్డి, గౌర సాయి, బీఆర్‌ఎస్ యూత్ అధ్యక్షుడు చిత్రం సాయి పాల్గొన్నారు.

అల్మాస్‌గూడలో..

2వ డివిజన్‌లోని అల్మాస్‌గూడలో బీఆర్‌ఎస్ కార్పొరేషన్ అధ్యక్షుడు రామిడి రాంరెడ్డి ఆధ్వర్యంలో కాసాని జ్ఞానేశ్వర్‌కు మద్దతుగా శుక్రవారం ఇంటింటి ప్రచారం చేశారు. మాజీ సర్పంచ్ ము త్యాల కృష్ణ, బోయపల్లి శేఖర్‌రెడ్డి, రామిడి తుఫాన్‌రెడ్డి, చప్పిడి కొండల్‌రెడ్డి, కొంతం రోహిత్‌రెడ్డి, ము రళీ, రాంరెడ్డి, గణేశ్, దర్శన్, కుమార్ పాల్గొన్నారు.

కందుకూరులో..

కందుకూరు: కాసాని జ్ఞానేశ్వర్‌ముదిరాజ్‌కు ఓటు వేయాలని బీఆర్‌ఎస్ మండల అధ్యక్షుడు మన్నే జయేందర్‌ముదిరాజ్, మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ ఎస్.సురేందర్‌రెడ్డి, పార్టీ నియోజకవర్గ ఉపాధ్యక్షుడు జి.లక్ష్మీనర్సింహారెడ్డి, పీఏసీఎస్ చైర్మన్ డి.చంద్రశేఖర్, మండల వర్కింగ్ ప్రెసిడెంట్ మేఘనాథ్‌రెడ్డి కోరారు. శుక్రవారం కందుకూరు, కొత్తగూడ, జైత్వారం గ్రామాల్లో ఇంటింటి ప్రచారం చేశారు. ఎంపీటీసీలు కాకి రాములు, ఎస్.రాజశేఖర్‌రెడ్డి, సామ ప్రకాశ్‌రెడ్డి, ఎస్.పాండురంగారెడ్డి, సామ మహేందర్‌రెడ్డి పాల్గొన్నారు.

తుక్కుగూడలో..

తుక్కుగూడ: కాసాని జ్ఞానేశ్వర్ గెలుపే లక్ష్యంగా మున్సిపాలిటీ కేంద్రంలో ఇంటింటి ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా కారు గుర్తుకు ఓటు వేసి గెలిపించాలని ఓటర్లను అభ్యర్థించారు. ఈ కార్యక్రమంలో కౌన్సిలర్ సప్పిడి లావణ్య, రాజు, చంద్రశేఖర్‌రెడ్డి, శ్రీధర్‌గౌడ్, నర్సింహ్మారెడ్డి, సురేష్, శ్రీనివాస్, తదితరులు పాల్గొన్నారు.



బడంగ్‌పేట్: ప్రచారం చేస్తున్న కార్పొరేటర్ స్వప్న

మెజార్టీ ఎంపీ సీట్లు సాధిస్తాం

ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి

ఆమనగల్లు: మహాలక్ష్మి పథకం ద్వారా ప్రతి పేద మహిళలకు ఏడాదికి రూ.లక్ష సాయం అందిస్తామని కల్వకుర్తి ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి చెప్పారు. ఆమనగల్లు పట్టణం, మంగళపల్లిలో శుక్రవారం నాగర్‌కర్నూల్ కాంగ్రెస్ ఎంపీ అభ్యర్థి డా.మల్లురవికి మద్దతుగా నిర్వహించిన ప్రచార కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. ఇంటింటికి తిరుగుతూ కాంగ్రెస్ పార్టీ అందించే పథకాల గురించి వివరించారు. మల్లురవిని భారీ మెజార్టీతో గెలిపించాలని కోరారు. ఈ కార్యక్రమంలో పీసీసీ సభ్యుడు అయిల శ్రీనివాస్‌గౌడ్, ఎంపీపీ అనిత, వైస్ ఎంపీపీ జక్కు అనంతరెడ్డి, మాజీ జెడ్పీటీసీ శ్రీనివాస్‌రెడ్డి, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు నర్సింహ, మండల అధ్యక్షుడు జగన్, మాజీ అధ్యక్షుడు రాములు, పట్టణాధ్యక్షుడు మానయ్య, మాజీ సర్పంచ్ గుర్రం కేశవులు, జిల్లా గ్రంథాలయ సంస్థ మాజీ డైరెక్టర్ వస్పుల జంగయ్య, కాంగ్రెస్ నాయకులు ఖలీల్, జంగయ్య, హర్షవర్ధన్‌రెడ్డి, నారాయణరెడ్డి, మహేశ్, కృష్ణనాయక్, దశరథం తదితరులు పాల్గొన్నారు.

పేదలకు అండగా ఉంటాం..

కడ్తాల్: పేదలకు ఎల్లప్పుడూ కాంగ్రెస్ పార్టీ అండగా ఉంటుందని కల్వకుర్తి ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి అన్నారు. నాగర్‌కర్నూల్ కాంగ్రెస్ ఎంపీ అభ్యర్థి మల్లురవికి మద్దతుగా శుక్రవారం మండల పరిధిలోని చల్లంపల్లి, వంపుగూడలో పీసీసీ సభ్యుడు అయిళ్ల శ్రీనివాస్‌గౌడ్‌తో కలిసి ఎమ్మెల్యే ఇంటింటి ప్రచారం నిర్వహించారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ.. లోక్‌సభ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీకి మెజార్టీ సీట్లు రావడం ఖాయమన్నారు. ఉమ్మడి జిల్లా అభివృద్ధి కోసం మల్లురవిని అత్యధిక మెజార్టీతో గెలిపించుకుందామని అన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపీటీసీ శ్రీనివాస్‌రెడ్డి, నాయకులు నర్సింహ, బీక్యానాయక్, హన్మానాయక్, సురేందర్‌రెడ్డి, అమర్‌నాథ్‌రెడ్డి, పర్వతాలు, జహంగీర్‌బాబా, భాస్కర్‌రెడ్డి, నరేందర్, రామకృష్ణ, తిరుపతిరెడ్డి, హీరాసింగ్ తదితరులు ఉన్నారు.

కాంగ్రెస్‌తోనే సుస్థిర పాలన..

తలకొండపల్లి: రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వంతోనే సుస్థిర పాలన సాధ్యమని వైస్ ఎంపీపీ శ్రీనివాస్‌రెడ్డి అన్నారు. నాగర్ కర్నూల్ కాంగ్రెస్ ఎంపీ అభ్యర్థి మల్లు రవికి మద్దతుగా శుక్రవారం గట్టుఇప్పలపల్లిలో ఆయన ఇంటింటి ప్రచారం నిర్వహించారు. మల్లురవిని గెలుపిస్తే నాగర్‌కర్నూల్ లోక్‌సభ నియోజవర్గాన్ని అన్నిరంగాల్లో అభివృద్ధి చేస్తామన్నారు. కార్యక్రమంలో నాయకులు.. డేవిడ్, శ్రీనివాస్‌రెడ్డి, రేణురెడ్డి, మచ్చేందర్, మల్లయ్య, అంజయ్య, మైసయ్య తదితరులు పాల్గొన్నారు.

ప్రజల మనిషి మల్లురవి..

తలకొండపల్లి: ప్రజల మనిషి డాక్టర్ మల్లురవి అని ప్రజా సంఘాల నాయకుడు సుధాకర్ అన్నారు. శుక్రవారం మండల కేంద్రంలో ఆయన, కాంగ్రెస్ అబ్జర్వర్ రమేష్, సీనియర్ నేత రఘురామ్‌తో కలిసి మాట్లాడారు. నాగర్‌కర్నూల్ కాంగ్రెస్ ఎంపీ అభ్యర్థిగా పోటీచేస్తున్న మల్లురవిని భారీ మెజార్టీతో గెలిపించాలని కోరారు. కార్యక్రమంలో కాంగ్రెస్ కిసాన్‌సెల్ రాష్ట్ర కార్యదర్శి మోహన్‌రెడ్డి, రఘురాములు, ఎంపీటీసీల ఫోరం అధ్యక్షుడు రమేష్, నాయకులు.. యాదయ్య, వెంకటయ్య, ఎస్సీసెల్ జిల్లా నాయకులు ప్రవీణ్, డేవిడ్ తదితరులు పాల్గొన్నారు.



ఆమనగల్లు: ప్రచారం నిర్వహిస్తున్న ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి

క్రీడలతో ఉజ్వల భవిష్యత్

ఎంపీపీ మధుసూదన్‌రెడ్డి

కొత్తూరు: క్రీడల్లో రాణిస్తే విద్యార్థులు, యువతకు ఉజ్వల భవిష్యత్తు ఉంటుందని కొత్తూరు ఎంపీపీ మధుసూదన్‌రెడ్డి అన్నారు. మండలంలోని గూడూరు గ్రామంలో శుక్రవారం ఏర్పాటు చేసిన గూడూరు ప్రీమియర్ లీగ్ క్రికెట్ టోర్నమెంట్‌ను ముఖ్యఅతిథిగా హాజరై ప్రారంభించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. యువత, విద్యార్థులు విలువైన సమయాన్ని వృథా చేయకుండా తమకు ఆసక్తి ఉన్న క్రీడల్లో రాణించాలని కోరారు. క్రీడల్లో రాణిస్తే భవిష్యత్తులో పోలీసు, ఆర్మీతో పాటు పలు రంగాల్లో సులువుగా ఉద్యోగాలు సాధించే అవకాశం ఉందన్నారు. క్రీడలు ఆయా ప్రాంతాలకు చెందిన యువకుల మధ్య స్నేహభావం పెంపొందిస్తాయన్నారు. క్రీడాకారులు ప్రభుత్వం అందించే ప్రోత్సాహంతో రాష్ట్ర, జాతీయస్థాయి క్రీడల్లో రాణించాలని పిలుపునిచ్చారు. అనంతరం తన సొంత ఖర్చులతో క్రీడాకారులకు టీ షర్టులు అందజేశారు. కార్యక్రమంలో నాయకులు పద్మారావు, సత్తయ్య, రాజు, దయానంద్ గుప్తా, రవినాయక్, మోడి దర్శన్, మల్లేశ్, నర్సింహ్మ, సిద్దు, సదానంద్ పాల్గొన్నారు.



టోర్నమెంట్‌ను ప్రారంభిస్తున్న ఎంపీపీ మధుసూదన్‌రెడ్డి

చలివేంద్రాలు ఎంతో దోహదం

మొయినాబాద్‌రూరల్: వేసవిలో చలివేంద్రాలు ప్రజలకు ఎంతో దోహదపడతాయని మొయినాబాద్ సీఐ పవన్‌కుమార్‌రెడ్డి పేర్కొన్నారు. మండల పరిధిలోని హిమాయత్‌నగర్ చౌరస్తాలో విజయ్‌తాగూర్ గార్డెన్ ప్రొపరేటర్ సతీష్‌కుమార్ తన ఫంక్షన్ హాల్ ఎదుట కూల్ వాటర్‌తో చలివేంద్రాన్ని ఏర్పాటు చేశారు. ముఖ్యఅతిథిగా సీఐ పవన్‌కుమార్‌రెడ్డి పాల్గొని ప్రారంభించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. వేసవిలో దప్పిక తీర్చడం అభినందనీయమన్నారు. రోజు రోజుకు ఎండలు విపరీతంగా పెరగాయని చెప్పారు. చిలుకూరు బాలాజీకి వెళ్లే రహదారికి దగ్గరగా ఉండడంతో భక్తులకు ఎంతో ఉపయోగపడుతుందన్నారు. విజయ్‌తాగూర్ మేనేజర్ రాకేశ్, యువకులు పాల్గొన్నారు.

అక్రమ నిర్మాణాల కూల్చివేత



అక్రమ నిర్మాణాన్ని కూల్చివేయిస్తున్న అధికారులు

పహాడీషరీఫ్: చెరువులో అక్రమంగా నిర్మించిన కట్టడాన్ని నీటి పారుదల శాఖ అధికారులు శుక్రవారం కూల్చివేయించారు. వివరాలు ఇలా ఉన్నాయి..జల్‌పల్లి మున్సిపాలిటీ కార్యాలయం దిగువన ఉన్న తాళ్లకుంటలో కొందరు వ్యక్తులు కుంట భూమిలో గుట్టుచప్పుడు కాకండా నిర్మాణం చేపట్టారు. ఈ విషయం తెలుసుకున్న నీటి పారుదల శాఖ ఏఈఈ గంగరాజు, వర్కింగ్ ఇన్‌స్పెక్టర్ జనార్దన్ ఆధ్వర్యంలో పోలీస్ బందోబస్తు నడుమ నిర్మాణాన్ని కూల్చివేయించారు. చెరువులు, శిఖం భూముల్లో నిర్మాణాలు చేపడితే కఠిన చర్యలు తీసుకుంటామని అధికారులు హెచ్చరించారు.

వీధి కుక్కలు కరిచేస్తున్నాయి

- ఆందోళనలో బాలాపూర్ వాసులు
- నాలుగు నెలల్లో 500లకు పైగా కేసుల నమోదు
- కుటుంబ నియంత్రణ ఆపరేషన్లు చేసినా కానరాని ఫలితం



మీర్‌పేట: రోజురోజుకు కుక్క కాటు దాడులు పెరగడంతో పాటు బాధితుల సంఖ్య కూడా పెరుగుతున్నాయి. బాలాపూర్ పట్టణ ప్రాథమిక ఆరోగ్య కేంద్రం పరిధిలో వీధికుక్కలు చిన్నారులు, వృద్ధులపై ప్రతాపాన్ని చూపిస్తున్నాయి. మీర్‌పేట కార్పొరేషన్‌తో పాటు బడంగ్‌పేట, జల్‌పల్లి ప్రాంతాల్లోనూ వీధికుక్కలు రెచ్చిపోతున్నాయి. దీంతో రోజుకు కనీసం 10 మంది వరకు యాంటీ రేబీస్ వ్యాక్సిన్ కోసం ఆసుపత్రికి క్యూ కడుతున్నట్లు బాలాపూర్ పట్టణ ఆసుపత్రి సిబ్బంది తెలిపారు.

పెరిగిన బాధితులు..

బాలాపూర్ మండల పరిధిలో గత నాలుగు నెలల్లో 521 కుక్క కాటు కేసులు నమోదయ్యాయి. జనవరిలో అత్యధికంగా 188, ఫిబ్రవరిలో 103, మార్చిలో 109, ఏప్రిల్‌లో 121 మంది కుక్కకాటు గురయ్యారు. ఈ సంఖ్య వైద్యసిబ్బందికి, అధికారులకు ఆందోళన కలిగిస్తోంది. రోజురోజుకు బాధితులు పెరిగిపోతున్నారని, ఆసుపత్రికి వచ్చే వారికి నాలుగు దశల్లో యాంటీ రేబీస్ వ్యాక్సిన్‌తో పాటు టీటీ కూడా ఇస్తున్నామని ఆసుపత్రి సిబ్బంది వివరిస్తున్నారు. అధిక రక్తస్రావం అయిన వారిని నారాయణగూడ ఫీవర్ ఆసుపత్రికి తరలిస్తున్నామని వైద్యులు చెబుతున్నారు.

ఫలించని ఆపరేషన్లు..

మీర్‌పేట ప్రాంతంలో పెరిగిపోతున్న వీధికుక్కల సంఖ్యను నియంత్రించేందుకు గతంలో కుటుంబ నియంత్రణ ఆపరేషన్లు చేశారు. ఇందుకోసం మీర్‌పేట పెద్దచెరువు శ్మశాన వాటిక వద్ద ప్రత్యేకంగా కుక్కల కోసం ఇనుప కంచె బోన్‌లు సైతం ఏర్పాటు చేసి అక్కడే ఆపరేషన్‌లు నిర్వహించేవారు. ఈ ప్రక్రియ దాదాపు మూడు నెలల పాటు జరిగింది. అయినా పెద్దగా ఫలితం లేకుండా పోయిందని, ఆపరేషన్ల పేరిట ఇతర ప్రాంతాల నుంచి కూడా కుక్కలను తీసుకొచ్చి తరువాత అక్కడే వదిలేసేవారని వైద్య సిబ్బంది చెబుతున్నారు. ప్రస్తుతం వేసవి సెలవులు కావడంతో పిల్లలు సాయంత్రం వేళల్లో బయట ఆడుకుంటారని, గుంపులు గుంపులుగా తిరుగుతున్న కుక్కలు ఎక్కడి నుంచి వచ్చి దాడి చేస్తాయోనని కాలనీ వాసులు ఆందోళన చెందుతున్నారు.